# పదవిదారుల కర్తవ్యములు బాధ్యతలు

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 18.08.2023 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

اَشۡھَدُ اَنۡ لَّاۤ اِلٰہَ اِلَّا اللّٰہُ وَحۡدَہٗ لَا شَرِیۡکَ لَہٗ وَاَشۡھَدُ اَنَّ مُحَمَّدًا عَبۡدُہٗ وَرَسُوۡلُہٗ۔ اَمَّا بَعۡدُ فَاَعُوۡذُ بِاللّٰہِ مِنَ الشَّیۡطٰنِ الرَّجِیۡمِ ○ بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ○ مٰلِکِ یَوۡمِ الدِّیۡنِ ○ اِیَّاکَ نَعۡبُدُ وَاِیَّاکَ نَسۡتَعِیۡنُ ○ اِھۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ○ صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡھِمۡ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡھِمۡ وَلَا الضَّآلِّیۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు ఆదేశించెను. నిశ్చయముగా న్యాసములను వాటి అర్హులకు అప్పగించండి. ఒక హదీసులో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. ప్రజల సమస్యల పట్ల అధికారము లభించిన ఏదేని పదవి లేదా స్థాయి కూడ ఒక రకంగా న్యాసమే అనబడును. కావున మన జమాఅత్ వ్యవస్థలో కూడ ప్రతి పదవి లేదా సేవ న్యాసమే అగును.

జమాఅత్ వ్యవస్థలో ప్రతి దశలో పదవిదారుల ఎన్నికలు జరుగుతాయి. ఈ ఉద్దేశము కొరకు మీరెప్పుడైనా ఎన్నుకున్నప్పుడు న్యాసపు (పదవి) హక్కులను చెల్లించగల వ్యక్తులను ఎన్నుకోవాలనే విషయమును గుర్తుంచుకోగలరని అల్లాహ్ తఆలా ఆదేశించెను.

ఎన్నికల సందర్భమున బంధుత్వమును లెక్క చేయకూడదు. కొన్ని సార్లు కొందరు పదవిదారులు కేంద్రము ద్వారా లేదా వర్తమాన ఖలీఫా ద్వారా నియమించబడుతారు. అన్ని విధాలా ఆలోచించి అందుబాటులో వున్న వారిలో అందరికంటే సముచితమైన వ్యక్తిని నియమించుటకు ప్రయత్నము చేయ బడుతుంది. కొన్ని సార్లు అంచనాలు తప్పుతాయి లేదా పదవి పొందిన తర్వాత ప్రజల స్వభావములో మార్పులు సంభవిస్తాయి, వినయము, ప్రశమటోడ్చి పని చేసే స్ఫూర్తి తగ్గుతుంది. సారాంశమేమనగా దుఆ చేసి మనలోని అందరికంటే మెరుగైన వ్యక్తిని ఎన్నుకొనుటకు మనము కృషి చేయవలెను. పదవిని ఆశిస్తు ముందు ముందుకు వస్తున్న వ్యక్తికి పదవి ఇవ్వకూడదని లేదా సేవ అప్పగించకూడదని ప్రయత్నము చేయబడుతుంది. ఇటువంటి వ్యక్తి ఎన్నికై వచ్చినను కేంద్రమునకు లేదా వర్తమాన ఖలీఫాకు అతని పరిస్థితుల గురించి తెలిసినచో ఆమోదము తెలుపబడదు. ఈ పద్ధతి మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సున్నత్ ప్రకారమే అనుసరించబడుతుంది. ఒకసారి ఇద్దరు వ్యక్తులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. ఫలానా సేవ మాకు అప్పగించండి,

మేము దానికి అర్హులము. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు బదులిచ్చిరి. నేను స్వయంగా ఎవరికైనా ఏదేని సేవ అప్పగించినచో అల్లాహ్ తఆలా అతనికి సహకరించును. కాని ఎవరైనా స్వయంగా అడిగి ఏదేని పదవి తీసుకున్నచో అతనికి అల్లాహ్ తఆలా సహకరించడము. అతని పనిలో శుభములు కలుగవు. కావున ఎప్పుడైనా పదవిని ఆశించకూడదు. ఏదో ఒక రకంగా అయని సరే ధర్మ సేవ చేయాలనే ఉత్సాహము మాత్రము వుండవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సంవత్సరం కొన్ని దేశములలో ఉపశాఖల ఎన్నికలు జరగనున్నవి. ఈ శాఖలలో ఎవరైతే ఎన్నికల కమిటీ సభ్యులున్నారో వారు అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు దుఆ, నిజాయతితో తమ ఓటు హక్కును వినియోగించుకోవలెను.

ఈ సందర్భంగా పదవిదారులకు వారి బాధ్యతల గురించి కూడ నేను విషయములు సూచించ దలచితిని. అల్లాహ్ తఆలా మాకు సేవ చేయు అనుగ్రహమిచ్చెనని పదవిదారులు ఎల్లప్పుడు గుర్తుంచు కోవలెను. కావున అన్ని రకాల స్వార్థములను వీడి సేవ చేయవలెను. కొందరు పదవిదారులలో వినమ్రత లోపించిందని ఫిర్యాదులు అందుతుంటాయి. తుదకు కొందరు పదవిదారులు సలాంకు సమాధానం కూడ చెప్పరని ఫిర్యాదులు వస్తుంటాయి. ఈ విధంగా ప్రవర్తించేవారు తమ పద్ధతిని మార్చుకోవలెను. చిన్న పెద్ద ప్రతి ఒక్కరితో వినమ్రంగా వ్యవహరించవలెను. అప్పగించబడిన బాధ్యత హక్కు చెల్లించుటకు ప్రయత్నించవలెను. తమ శక్తియుక్తులన్నిటిని ఈ బాధ్యతను ఉత్తమ రీతిలో నెరవేర్చుటకు వినియోగించ వలెను. ఇలా ఆలోచించినప్పుడే సరియైన రీతిలో పని చేయు స్ఫూర్తి కలుగుతుంది, జమాఅత్ సభ్యుల సహాయము కూడ లభిస్తుంది. కొన్ని శాఖలలో జమాఅత్ సభ్యులు సహాయం చేయరని అధికంగా పదవిదారులు ఫిర్యాదు చేస్తుంటారు. ఈ సేవకు సభ్యులు ఎవరిని ఎన్నుకున్నారో వారికి సహకరించుట సభ్యుల బాధ్యత అనుటలో సందేహం లేదు. కాని పదవిదారులు కూడ తమ ఉత్తమ ఆదర్శమును ప్రజలకు చూపించవలెను.

ఇలాగే అధికంగా ఇస్తిగ్ఫార్, అల్లాహ్ తఆలా స్మరణతో పాటు తమ స్థితులను పరిశీలించుకోవలసిన అవసరమున్నది. ఒక తర్బియత్ (శిక్షణ) కార్యదర్శి ఐదు పూటలు నమాజ్ సలుపనిచో నమాజ్ చదవాలని ఇతరులకు ఎలా సూచించగలడు? ఎవరైనా పదవిదారులు నిర్ణీత శాతం ప్రకారము చందా చెల్లించనిచో ధన త్యాగము గురించి వారు ఇతరులకు ఎలా సూచించగలరు? శిక్షణ కార్యదర్శులు తమ ఉత్తమ ఆదర్శములతో ప్రేమ, అనురాగములను ప్రదర్శిస్తు జమాఅత్ సభ్యుల శిక్షణ చేపట్టినచో అదొక విప్లవము సృష్టించవచ్చును.

ప్రతి పదవిదారుడు తమ పని మంచిగా జరగాలని ప్రతి రోజు కనీసం రెండు రకాతులు నఫిల్ నమాజ్ చదవవలెను. తర్బియత్ (శిక్షణ) శాఖ క్రియాశీలకంగా మారినచో ఇతర శాఖలు వాటంతట అవే 70 శాతం పని చేయును.

ఉపశాఖలు కూడ ప్రతి దశలో తమను తాము క్రియాశీలకంగా మార్చుకోవలెను. పదవిదారులు వేదిక మీద కూర్చుకోవడం కొరకు లేరు. ప్రతి పదవిదారుడు సేవకునిగా తమ బాధ్యతను నెరవేర్చవలెను. జాతి నాయకుడు జాతి సేవకుడని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారు. జమాఅత్ సభ్యులతో స్వంతంగా సత్సంబంధములు ఏర్పరచుకొనుట కూడ పదవిదారుల కర్తవ్యమే. వారి సంతోష, దుఃఖ వేడుకలలో పాల్గొనవలెను. పరస్పరం సహకరించుకొనుటకు, సానుభూతితో వ్యవహరించుటకు జమాఅత్ వ్యవస్థ ఏర్పడినదని ప్రజలలో చైతన్యం కలిగించండి. ఇదే భావన మనందరిని అల్లాహ్ తఆలాకు దగ్గరగా చేయును. తమ బాధ్యతలను గుర్తిస్తు తమ పనిని చేపట్టే గట్టి సహాయకులను అల్లాహ్ తఆలా ఎల్లప్పుడు ఖిలాఫత్‌కు అందించుగాక!

కార్యవర్గ సమావేశములు, మీటింగులలో పాల్గొని తమ అభిప్రాయమును వెల్లడించి మేము మా బాధ్యతలను నెరవేర్చినాము, ఇక చాలని పదవిదారులు భావించరాదు. ప్రజల మేలు కొరకు ప్రణాళికలు రచించుట, అనంతరం వాటిని ఆచరించుట చాలా ముఖ్యమైన విషయము. అందుబాటులో వున్న వనరులను అనుసరిస్తు ఉత్తమ ప్రణాళికతో ప్రజల అవసరాలను తీర్చండి.

ప్రస్తుతం వివాహ సంబంధముల శాఖ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఇందుకు విశాల ప్రణాళికతో పని చేయవలసిన అవసరమున్నది. జమాఅత్ వ్యవస్థతో పాటు ఉపశాఖలు సంయుక్తంగా ఇందుకు పని చేయవలెను. ఇందుకు కూడ తర్బియత్ విభాగము ప్రకియాశీలకంగా మారవలసిన అవసరమున్నది. మన నవయువకులను సరియైన పద్ధతిలో తీర్చిదిద్దినచో మనము మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశమును ఎల్లప్పుడు గుర్తుంచుకొన్నవారమైతాము. అనగా వివాహ సంబంధము కొరకు ధనము, వంశము, అందము బదులు ధర్మమునకు ప్రాధాన్యతనివ్వవలెను.

ఉమూరె ఆమ్మ (అదనపు సమస్యల) శాఖ కూడ చాలా ముఖ్యమైనదే. ప్రజలకు శిక్షలు ఇప్పించుట, కఠినంగా హెచ్చరించుటయే ఈ శాఖ పని అని సాధారణంగా భావిస్తారు. ఈ శాఖలో పని చేయువారి పని ఇది మాత్రమే కాదని, పనిలో ఇదొక భాగమని ఈ శాఖ బాధ్యులు గుర్తించుకోవలెను. కఠినంగా హెచ్చరించుట వారి పని మాత్రము కానే కాదు. మరో దారి లేని చోట మాత్రమే ఇది అవసరముంటుంది. అప్పుడే ఇందుకు సిఫారసు చేయబడుతుంది. తర్బియత్ శాఖ క్రియాశీలకంగా మారినచో జమాఅత్ సభ్యుల వివాదముల గరించి ఉమూరె ఆమ్మ చాలా సమస్యలు వాటంతట అవే పరిష్కారమగును. ప్రజలకు శిక్షలు ఇప్పించుట ఉమూరె ఆమ్మ పని కాదు. శిక్షల నుండి రక్షించుట వారి పని. ఇందుకు సాధ్యమైనంత వరకు కృషి చేయవలెను.

కొన్ని సార్లు పదవిదారుల వ్యవహారము వలన జమాఅత్ సభ్యులలో జమాఅత్ వ్యవస్థ పట్ల అపోహలు కలుగుతాయి. వర్తమాన ఖలీఫా కార్యాలయములో పంపింపచబడే ప్రతి ఉత్తరమును తెరిచి, చదివి, చర్యలు చేపట్టడం జరుగుతుందని నేను జమాఅత్ సభ్యులకు చెప్పదలచితిని. ఎక్కడైనా ఆలస్యము

జరుగుతుందంటే అది సంబంధిత జమాఅత్‌లో జరుగుతుంది. ఈ విధంగా వర్తమాన ఖలీఫా, జమాఅత్ సభ్యుల మధ్య దూరము పెరుగుటకు ఈ పదవిదారులు కారణమైతారు.

అవసరమున్న ప్రజల సమస్యలు ఏ పదవిదారులకు అప్పగించబడుతాయో వారు ప్రత్యేకంగా గుర్తుంచుకోండి. తమ విధులను చెల్లించుటలో ఎలాంటి ఆలస్యము, అలసత్వమును వహించకండి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. ఇమామ్ అనగా పదవిదారులు పీడిత, అర్హులైన ప్రజల కొరకు తమ ద్వారములను మూసుకుంటారో, అల్లాహ్ తఆలా వారి అవసరాలను తీర్చకుండా ఆకాశ ద్వారములను మూసివేస్తాడు. ఇలాంటి భావము గల ఎవరైనా పదవిదారులు లేదా వారి కార్యాలయములో ఏవరైనా సేవకులు వున్నచో వారు అల్లాహ్ తఆలాతో భయపడుతు ప్రజల అవసరాలను తీర్చుటకు త్వరపడవలెను. వినతి పత్రము తీసుకొని పెట్టెలో పెట్టుకొనుట, సుదీర్ఘ కాలము వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చాలా పెద్ద నేరమగును.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. మీరెక్కడున్నా అల్లాహ్ తఆలాతో భయపడండి, ప్రజలతో సత్ప్రవర్తన, మర్యాదగా వ్యవహరించండి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూమూసా, ముఆజ్ బిన్ జబల్‌ను యెమెన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాలకు నియమించి పంపుతు వారికిట్లు ఉపదేశించిరి. సౌలభ్యము కలిగించండి, కష్టములను సృష్టించకూడదు, ప్రేమ, ఆనందమును పంచి పెట్టండి, ద్వేషమును పెరగనివ్వకండి. ఈ ఉపదేశమును ప్రతి పదవిదారుడు మార్గదర్శ సూత్రముగా ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవలెను.

మనము మనలో ఆధ్యాత్మిక అందమును పుట్టించుకోవాలని ప్రతి పదవిదారుడు మంచిగా గుర్తుంచుకోవలను. ఇందుకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ - وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ - وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ - عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ - یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ - اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ -

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*